తార్నాకలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తార్నాకలోని మర్రికృష్ణా హాల్లో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో 'జనరేషన్స్ టుగేదర్' పేరిట వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనికి దాదాపు 300కు పైగా వృద్ధులు వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ స్త్రీ సేవా సంస్థ అధ్యక్షురాలు గురజాడ శోభ పేరిని దేవి, ప్రజా ఆలోచనా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వేపూరి గోపాల్‌రావు, ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ శ్రీధర్, పలు సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు భూమారెడ్డి, రాఘవరావు, హెల్ప్ ఏజ్ ఇండియా స్టేట్ హెడ్ రాజా మహ్మమద్ తదితరులు మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ సెర్ప్ సీఈఓ ఐఏఎస్ అధికారి దివ్య ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ వృద్ధుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం 80 ఏళ్లు దాటిన పలువురు వృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెల్ప్ ఏజ్ ఇండియా ప్రతినిధులు యతేంద్ర యాదవ్, పీ సుభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్ఆర్ హయాంలోనే ట్రిబ్యునల్స్ ఏర్పాటు ..

వయోవృద్ధులకు ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేయాలని 2007లోనే కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిందని, కానీ ఏ రాష్ట్రం అమలు చేయలేదని కేవలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాత్రమే అమలు చేశారని వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజెన్స్ చీఫ్ ఎడిటర్ భూమారెడ్డి తెలిపారు. తర్వాత అన్ని జిల్లాలోనూ ఏర్పాటు చేసిందని వాటితో కలిగే ప్రయోజనాలపై ప్రాంతాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేవలం హైదరాబాద్‌లోనే దాదాపు 60 వేలకు పైగా వృద్ధులు ఉన్నట్లు వారి కోసం హెల్ప్ ఏజ్ ఇండియా చేస్తున్న కృషిని అభినందించారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు

బోర్డు సీఈవో డీ మధుకర్ నాయక్



జుంబా డ్యాన్స్‌లో పాల్గొన్న సీఈవో తదితరులు



రన్‌లో పాల్గొన్న సీఈవో మధుకర్ నాయక్, జాయింట్ సీఈవో పల్లవి తదితరులు

రసూల్‌పురా: పరిసరాలు శుభ్రంగా ఉంచడమే కాకుండా ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ఉండేలా కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని బోర్డు సీఈవో డీ మధుకర్ నాయక్ అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవ- 2024' లో భాగంగా మడ్‌ఫోర్ట్‌లోని హాకీ మైదానం నుంచి బోర్డు అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 2కే మారథన్ రన్‌ను జాయింట్ సీఈవో పల్లవి విజయవంశీతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రన్ ఎంఈఎస్ క్వార్టర్స్, కేజేఆర్ గార్డెన్ కంటోన్మెంట్ వర్క్‌షాపు, డైమాండ్ పాయింట్ చౌరస్తా, మస్తానా చౌరస్తా నుంచి తిరిగి హాకీ మైదానానికి చేరుకున్నది. అనంతరం హాకీ మైదానంలో ఏర్పాటు చేసిన జుంబా డ్యాన్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపరిటెండెంట్ ఎం. దేవేందర్, శానిటరీ సూపరింటెండెంట్ మహేందర్, శానిటరీ, ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగం అధికారులు, స్థానిక నాయకులు, కాలనీ, బస్తీవాసులు పాల్గొన్నారు.

మంత్రిని అవమానించినవారిపై కేసు నమోదు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రి కొండా సురేఖను అవమానించిన బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం నాయకులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల మెదక్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సురేఖకు నూలుపోలు బహుకరించిన ఎంపీ రఘునందన్ రావు వీడియోను బీఆర్ఎస్ నేతలు వక్రీకరించి పైశాచిక ఆనందం పొందడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. నిందితులను గుర్తించి మీడియా ఎదుట ప్రవేశపెట్టాలని లేకుంటే బీసీ మహిళలు బీఆర్ఎస్ నేతలకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

డీజేలు పెడితే చర్యలు



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి

అడ్డగుట్ట: దేవీ నవరాత్రుల ఊరేగింపు సమయాల్లో డీజేలు పెడితే చర్యలు తప్పవని లాలాగూడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండప నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఊరేగింపుల్లో డీజేలు, క్రాకర్స్, అధిక సౌండ్‌తో ప్యాడ్ బ్యాండ్‌లు పెడితే మండప ఆర్గనైజర్లతో పాటు డీజే సెటప్ నిర్వాహకులపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఐలు నాగరాజు యాదవ్, షాహీద్ పాషా, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మూసీ బాధితులకు ఇళ్ల కేటాయింపుపై ఆందోళన



ధర్నా చేస్తున్న లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

రసూల్‌పురా: బీఆర్ఎస్ ప్రభుత్వం తమకు కేటాయించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను మూసీ బాధితులకు ఎలా కేటాయిస్తారని కంటోన్మెంట్ నియోజకవర్గ మడ్‌ఫోర్ట్ గాంధీనగర్, శ్రీరాంనగర్ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్, రెవెన్యూ, మెప్మా అధికారులు శ్రీరాంనగర్, గాంధీనగర్ డబుల్‌బెడ్రూం సముదాయాల్లో ఖాళీగా ఉన్న ఇండ్ల సర్వేకు మంగళవారం రావడంతో అధికారులు, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, బీజేపీ నాయకులు బీఎస్. శ్రీనివాస్ మద్దతుగా ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో తమ ఇండ్ల స్థలాలు డబుల్‌బెడ్రూం కోసం ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డికి మా ఇండ్లే దొరికాయా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ చొరవ తీసుకుని స్థానికులకే ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు బీఎస్. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత మాట్లాడుతూ స్థానికేతరులకు కేటాయిస్తే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్ గాంధీనగర్‌కు చేరుకుని తిరుమలగిరి రెవెన్యూ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. సర్వే వచ్చారా..? అని ఆరా తీయగా తాము రాలేదని చెప్పారు. దీంతో అర్హులైన లబ్ధిదారుల జాబితా రూపొందించాలని సూచించారు. స్థానికేతరులకు ఇండ్లు కేటాయిస్తే ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని స్థానిక లబ్ధిదారులు హెచ్చరించారు.

6న బాలగోపాల్ స్మారక ఉపన్యాసం

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక ఉద్యమకారుడు బాలగోపాల్ 15వ సంస్మరణ సభను పురస్కరంచుకొని ఈ నెల 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్మారక ఉపన్యాసం జరగనుంది. హ్యూమన్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే కార్యక్రమంలో లలిత్ వచని రూపొందించిన ఉమర్ ఖలీద్, రాజకీయ ఖైదీలు, ఖైదీనంబర్.626710 హాజరు అనే గంట డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను ప్రదర్శించనున్నట్లు ఓయూ ప్రొ.కొండ నాగేశ్వర్ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ

సనత్‌నగర్: సనత్‌నగర్ హనుమాన్ ఆలయ కార్యనిర్వాహణాధికారిగా సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన శ్రీనివాసరాజు ఉద్యోగ విరమణ పొందగా, సికింద్రాబాద్ విఠలేశ్వర ఆలయ ఈఓగా పనిచేస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

వారాసిగూడ బస్తీలో 'సిటీ చిల్డ్రన్స్ పార్లమెంట్'



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ చిల్డ్రన్స్ పార్లమెంట్ ప్రతినిధి

బౌద్ధనగర్: వారాసిగూడలోని బస్తీలో మంగళవారం సిటీ చిల్డ్రన్స్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటిపై చర్చించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సిటీ చిల్డ్రన్స్ కోఆర్డినేటర్ బానూరి వాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మోసిన్, ఆంజనేయులు, మంజుల, మాధవి, శోభ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

సనత్‌నగర్: రేపటి నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని సనత్‌నగర్ హనుమాన్ ఆలయం అధికారులు కోరారు. ఈ మేరకు ఈఓ సత్యనారాయణ, సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసానిని మంగళవారం కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. అదేవిధంగా ప్రసాదాలు అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ



చిలకలగూడ: జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ బాలకోటి మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు మల్లీశ్వరీ, జకియాబేగం, హసినాబేగం, నాగశృతి, రోటరీ క్లబ్ ప్రతినిధి ప్రదీప్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి విండ్సర్ వాహనం



సాక్షి,సిటీబ్యూరో: వైబ్రెంట్ ఎంజీ సికింద్రాబాద్ తన సరికొత్త విండ్సర్ వాహనాన్ని మంగళవారం మార్కెట్లోకి విడుదల చేసింది. పాత్‌బ్రేకింగ్ ఎంజీ విండ్సర్ సీయూవీ శైలిలో ఫీచర్, ఏరో లాంజ్ సీట్లు, గ్రాండ్‌వ్యూ టచ్ డిస్‌ప్లే ఇన్ఫినిటీ వ్యూ గ్లాస్ రూఫ్, 18 డైమాంగ్ కట్ అల్లాయ్ వీల్స్ కలిగి ఉన్నాయి. కార్యక్రమంలో ఇండియన్ ప్రొఫెషనల్ షూటర్ఆర్-ఎల్ కైనాన్, ఆర్‌ఎస్‌ఎం ఎంజీ మోటార్స్ సాయికిరణ్ రెడ్డి, టీవీ నటుడు మానస్ నాగులపల్లి, వైబ్రెంట్ డైరెక్టర్, సిరాజ్ బాబుఖాన్ , మేనేజింగ్ డైరెక్టర్, బషీర్ బాబుఖాన్, వైస్ ప్రెసిడెంట్ మసియుద్దీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఈ నెల 3 నుంచి 12 వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరుకావాలని ఆలయ సూపరింటెండెంట్ హైమావతి కోరారు. ఈ మేరకు ఆలయ అధికారులు, సిబ్బందితో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమాను మంగళవారం కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రావు, అజయ్, నవీన్ రాజ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ పరిధిలో పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కార్పొరేటర్ మహేశ్వరి కోరారు. ఈమేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకాశ్‌నగర్, మాతాజీనగర్, శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అలాగే గతంలో నిధులు మంజూరై ప్రారంభం కానీ పనులను వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ద్వారకాదాస్ కాలనీ నాలా డీసీల్టింగ్ సరిగా చేయకపోవడం వల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయని కమిషనర్‌కు వివరించారు. స్పందించిన కమిషనర్ ప్రాధాన్యత క్రమంలో పూర్తయ్యేలా చూస్తానని హామీనిచ్చారని కార్పొరేటర్ తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ నేత శ్రీహరి కూడా ఉన్నారు.

పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లో పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ కంది శైలజ కోరారు. ఈ మేరకు మారేడుపల్లి జలమండలి కార్యాలయంలో జీఎం వినోద్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో లోప్రెషర్ తాగునీటి సరఫరా , డ్రైనేజీ సమస్యల పరిష్కరించాలని అలాగే పవర్‌బోర్ రిపేర్లు చేయించి అందుబాటులోకి తేవాలని కోరినట్లు ఆమె తెలిపారు.

ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో హృద్రోగ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న రోగులు, ఆసుపత్రి వైద్యులు

అమీర్‌పేట: అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో ప్రపంచ గుండె దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులు, వైద్య నిపుణుల సమక్షంలో 'నా గుండె-నాహక్కు' అనే థీమ్‌ను జరుపుకున్నారు. గుండె కవాటాల వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ముందస్తు గుండె పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆస్టర్ డీఎం హెల్త్ కేర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రాంతీయ సీఈఓ దేవానంద్ సూచించారు. జీవనశైలి మార్పులతోనే గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణుడు సాయి రవిశంకర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలశుభ్రత అందరి బాధ్యత



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఆర్పీవో స్నేహజ

రాంగోపాల్‌పేట్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి జే స్నేహజ అన్నారు. సికింద్రాబాద్‌లోని ఆర్పీవో కార్యాలయంలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా 'స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత' అనే అంశంపై ఉద్యోగులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల శుభ్రత అనేది ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి వారిలో పరిశుభ్రతపై అవగాహన కల్పించామని, అలాగే పారిశుద్ధ్య, సఫాయి మిత్ర కార్మికులకు వైద్య సేవలు అందించి సత్కరించామని తెలిపారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు గోడలకు అందమైన సాంప్రదాయ బొమ్మల చిత్రాలతో అలంకరించామని, అలాగే చుట్టుపక్కల ఫుట్‌పాత్‌లను చెత్త రహితంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు.

విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయురాళ్లు తీరొక్క పూలతో రంగు రంగుల బతుకమ్మలను పేర్చారు. అందరూ కలిసి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. – లాలాపేట, అమీర్‌పేట



లాలాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో..



వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫ్రెషర్స్, ఫేర్‌వెల్ డే హంగామా



విద్యార్థులతో అధ్యాపకులు, అతిథులు



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

సికింద్రాబాద్: మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే, ఫేర్‌వెల్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. అధ్యాపకులు, అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి అతిథులుగా సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ యువ నాయకుడు తీగుళ్ల రామేశ్వర గౌడ్ హాజరయ్యారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామచంద్రం, మహిళా నాయకురాలు శిల్పారామేశ్వర్ పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్: హరిహర కళాభవన్‌లో శ్రీసాయి సాయివిజ్ఞాన్ భారతి మహిళా కళాశాల గ్రాడ్యుయేషన్ డే, ఫ్రెషర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు డ్యాన్స్‌లతో హోరెత్తించారు. అలాగే ప్రదర్శించిన నాటికలు ఆలోచింపజేశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీఎస్ఎస్ఆర్ గౌరవ డైరెక్టర్ బీ సుధాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ యూత్ కో ఆర్డినేటర్ మాధవీలతారెడ్డి, యూనిసెంట్ స్కూల్స్ అకాడమిక్ డైరెక్టర్ అన్నపూర్ణ, చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాలో ప్రజా సంఘాలకు స్థానం కల్పించాలి



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

రాంగోపాల్‌పేట్: హైడ్రాపై జరుగుతున్న దుష్ప్రచారాలను ఆపేందుకు ప్రజా సంఘాలతో కమిటీ ఏర్పాటు చేసి స్థానం కల్పించాలని తెలంగాణ కామన్‌మెన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు వంగరి చందయ్య, ప్రతినిధి నందికంటి సాయి కుమార్ కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పేరుతో హైడ్రా చేస్తున్న కూల్చివేతలతో ఇండ్లు, ఆస్తులు కోల్పోయిన వారికి ప్రభుత్వం సరైనా పరిహారం అందిస్తుందని, న్యాయం చేస్తుందని నమ్మకం కలగడం లేదన్నారు. అలాగే మరికొంత మంది దుష్ప్రచారాలకు తెరతీశారన్నారు. ప్రజా సంఘాలతో కమిటీ ఏర్పాటు చేస్తే ప్రజలకు అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని కోరారు.

దేవీ శరన్నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి



కరపత్రాలు ఆవిష్కరించిన ఆలయ ఈఓ కృష్ణ, చైర్మన్ సాయిబాబాగౌడ్

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో దేవీశరన్నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కార్యనిర్వాహణ అధికారి బొల్లంపల్లి కృష్ణ తెలిపారు. మంగళవారం మహోత్సవాల కర పత్రాలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ తేదీన ఉదయం తెల్లవారు జామున 4.30 గంటల నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు మహోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 12వ తేదీ వరకు అమ్మవారు రోజుకో అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. సమావేశంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ సాయిబాబాగౌడ్, సూపరింటెండెంట్ హైమావతి పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో ఈనెల 3 నుంచి 12 వరకు దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి కామేశ్‌తో కలిసి మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చేశామని, అలాగే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించామన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సమర్థులనే వీసీలుగా నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ వర్సిటీలకు సమర్థులైన అధ్యాపకులనే వీసీలుగా నియమించాలని కోరుతూ బీఎస్ఎఫ్ నాయకుడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఏ సామాజిక వర్గానికి చెందిన వారైన సరే విద్యార్థులకు మెరుగైన బోధన, పరిశోధనలు అందించాలన్నారు. అందుకు అధ్యాపకులు, ఉద్యోగులను సమన్వయపరిచే శక్తి సామర్థ్యాలు గల ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ విద్యార్థి నేతలు వేల్పుల సంజయ్, అంబేడ్కర్, యుగంధర్, నరసింహ, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



షూలు అందజేసిన జీఎం సూర్యనారాయణ పాణిగ్రాహి

బన్సీలాల్‌పేట్: విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎన్‌టీపీసీ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ పాణిగ్రాహి అన్నారు. భోలక్‌పూర్ కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సీఎస్ఆర్ ద్వారా విద్యార్థులకు 700 జతల బూట్లు, బ్యాగులు, టీషర్టులు, అల్మారాలు, కుర్చీలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలతో పాటు బస్తీ, మురికివాడల్లో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీపీసీ మేనేజర్లు ప్రియాంక, గౌతమ్, ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, పూర్వ హెచ్‌ఎం మల్లికార్జున్‌రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఇ. చంద్రశేఖర్, కార్యదర్శి బి. నర్సింగ్‌రావు, గోపీకృష్ణ, భరత్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

సనత్‌నగర్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వేడుకలకు హాజరు కావాలని కోరుతూ జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ నేతృత్వంలో సభ్యులు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డితో కలిసి వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి మంగళవారం ఆహ్వానపత్రం అందజేశారు. కలిసిన వారిలో కమిటీ ఉపాధ్యక్షురాలు భాగ్యలత, లంక హైమావతి, అమరావతి, హరిత, కృష్ణకుమారి, సుజన, శ్రీదేవి, జ్యోతి, స్వప్న, కార్యనిర్వాహక సభ్యులు వాణి, మాధవి, విజయకాలనీ ప్రతినిధులు సురేశ్‌గౌడ్, విశ్వనాథ రాజు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ ఉప్పరిబస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. జలమండలి అధికారులతో కలిసి మంగళవారం ఉప్పరి బస్తీ, శ్రీనివాసనగర్, ఫ్రైడేమార్కెట్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లోప్రెషర్ తాగునీటి సరఫరా, మురుగునీటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. ఆమె వెంట జలమండలి సెక్షన్ మేనేజర్ వరుణ్, బీఆర్ఎస్ నాయకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సికింద్రాబాద్: గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్ల పోచంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి ఒకరు తీవ్రంగా గాయపడి, అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన క్షతగాత్రుడిని రైల్వే పోలీసులు చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాల కోసం 8712658581 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

అనారోగ్యంతో వ్యక్తి ..

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వృద్ధుడు ఐదో నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లగా అప్పటికే వ్యక్తి మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 65 ఏళ్ల వరకు ఉంటుందని వివరాలు లభించలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వివరాలకు 9392745915 లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.